ఉచిత ప్రయాణానికి సర్వం సిద్ధం

● ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి



ఫటాఫట్

కడప మారుతీనగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళలకు 15వ తేదీ శుక్రవారం నుంచి ఉచిత బస్సు ప్రయాణాన్ని చేపట్టనున్న సంగతి తెలిసిందే. ఆ పథకాన్ని ఎలాంటి ఆటుపోట్లు ఎదురు కాకుండా పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు కడప రీజియన్ పరిధిలోని బస్సులను పూర్తి సన్నద్ధం చేశామని ఆర్ఎం గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆంధ్రజ్యోతి అడిగిన పలు ప్రశ్నలకు ఆయన ఫటాఫట్ సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: కడప రీజియన్‌లో ఎన్ని బస్సులున్నాయి
జవాబు: మొత్తం 616 బస్సులున్నాయి. ఇందులో పల్లెవెలుగు 290, అల్ట్రా పల్లెవెలుగు 59, ఎక్స్‌ప్రెస్‌లు 113, సూపర్ లగ్జరీలు 105, అల్ట్రా డీలక్స్ 30, స్టార్‌లైనర్ 4, ఇంద్ర 11, అమరావతి 4 ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు దాదాపు రూ.90లక్షల ఆదాయం ఉంది.

ప్రశ్న: ఉచిత ప్రయాణానికి ఎన్ని బస్సులు సిద్ధం చేశారు
జవాబు: పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు సౌలభ్యం కలదు. వీరికోసం 462 బస్సులు సిద్ధంగా ఉన్నాయి.

ప్రశ్న: బస్సులను ఏ రకంగా సిద్ధం చేశారు
జవాబు: రెండు నెలలుగా రీజియన్‌లోని అన్ని బస్సుల కండీషన్లను మెరుగు పరిచాము. మార్గమధ్యంలో బస్సులు ఆగిపోకుండా పూర్తిస్థాయిలో సిద్ధం చేశాం. బస్సు టైర్లు, స్టీరింగ్, బ్రేకుల కండీషన్లు సరిచేశాం.

ప్రశ్న: ఈ బస్సుల్లో రోజుకు ఎంతమంది ప్రయాణిస్తున్నారు
జవాబు: దాదాపు లక్షా 51వేల మంది ప్రయాణం చేస్తున్నారు. ఇందులో 60,400 మంది మహిళా ప్రయాణికులు ఉన్నారు. ఉచిత బస్సుల వల్ల మహిళా ప్రయాణికులు మరో 24,100 మంది పెరిగే అవకాశం ఉంది.

ప్రశ్న: ఏఏ రూట్లలో ఎక్కువమంది ప్రయాణం చేసే వీలుంది
జవాబు: కడప-ప్రొద్దుటూరు, కడప-పులివెందుల, కడప-రాయచోటి, కడప-బద్వేలు రూట్లలో మహిళలు ఎక్కువగా ప్రయాణం చేసే అవకాశాలున్నాయి.

ప్రశ్న: మహిళా ప్రయాణికుల రద్దీ పెరిగితే ఏం చేస్తారు
జవాబు: అదనంగా పాఠశాల, కళాశాలలకు వెళ్లే 28 బస్సులను తిప్పేందుకు ఏర్పాట్లు చేశాం.

ప్రశ్న: డ్రైవర్లు, కండక్టర్ల కొరత ఉందా
జవాబు: రీజియన్ పరిధిలో డ్రైవర్ల కొరత ఉంది. దీన్ని అధిగమించేందుకు వీలుగా ఇటీవల దాదాపు 133 ఆన్‌కాల్ డ్రైవర్లను తీసుకున్నాం.

నేడే కౌంటింగ్

● పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
● ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ● కౌంటింగ్‌ను బాయ్‌కాట్ చేసిన వైసీపీ?



కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



పులివెందులలో రీ పోలింగ్‌పై సూచనలు ఇస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్



బ్యాలెట్ బాక్సులను భద్రపరిచిన మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ

(కడప-ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అందరూ ఎదురుచూస్తున్న పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికల ఫలితాలు గురువారం వెల్లడి కానున్నాయి. అసెంబ్లీ ఎన్నికలను తలదన్నే విధంగా ఈ ఎన్నికలు నువ్వా నేనే అనేలా జరగడంతో వీటి ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా పులివెందుల ఉప ఎన్నికల్లో గెలుపుపై అందరూ ఆసక్తిగా ఉన్నారు. ఇక్కడ గెలుపు టీడీపీకి దాదాపు ఖరారైనప్పటికీ అధికారిక ఫలితం కోసం ఎదురుచూస్తున్నారు. కాగా.. పులివెందులలో మంగళవారం చేపట్టిన పోలింగ్‌లో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు రావడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం తిరిగి 3, 14వ పోలింగ్ కేంద్రాల్లో బుధవారం రీపోలింగ్ నిర్వహించింది. ఈ రెండు చోట్లా ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి. అచ్చవెల్లి పోలింగ్ కేంద్రం (3)లో 492 ఓట్లు ఉంటే 337 ఓట్లు పోల్ అయ్యాయి. 68.50 శాతం మంది ఓట్లు వినియోగించుకున్నారు. ఇక ఈ.కొత్తపల్లె పోలింగ్ కేంద్రం(14)లో 1273 ఓట్లు ఉంటే 691 ఓట్లు పోల్ అయ్యాయి. 54.28శాతం మంది ఓట్లు వేశారు.

రీపోలింగ్‌ను బహిష్కరించాం : ఎంపీ

పులివెందుల రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో రీ పోలింగ్‌ను బహిష్కరించామని కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం జరిగిన ఉప ఎన్నికల పోలింగ్ చూస్తే టీడీపీ ఒక కొత్త సంస్కృతికి నాంది పలికిందన్నారు. 15 పోలింగ్ కేంద్రాల్లో కేంద్రబలగాల మధ్య రీపోలింగ్ నిర్వహించాలని తాము డిమాండ్ చేశామన్నారు. కానీ కంటితుడుపు చర్యగా కేవలం రెండు పోలింగ్ కేంద్రాలలో రీపోలింగ్ పెట్టారన్నారు. దీంతో తాము రీపోలింగ్‌ను బహిష్కరించామన్నారు.

8 గంటల నుంచి లెక్కింపు

రెండు జడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో పులివెందుల నుంచి 11 మంది, ఒంటిమిట్ట నుంచి 11 మంది పోటీ చేశారు. వీటికి సంబంధించి నగర శివారులోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. బ్యాలెట్ బాక్సులను ఇక్కడి స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. గురువారం ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలు కానుంది. పులివెందులకు సంబంధించి ఒక రౌండులో పది టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒంటిమిట్టకు సంబంధించి మూడు రౌండ్లు, పదిటేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక్కో టేబులుకు ఒక సూపర్‌వైజరు, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు ఉంటారు. అంటే సుమారు వంద మందికి పైగా సిబ్బంది ఓట్ల లెక్కింపులో పాల్గొననున్నారు.

వైసీపీ బాయ్‌కాట్.?

జడ్పీటీసీ ఉప ఎన్నికల కౌంటింగ్‌ను వైసీపీ బాయ్‌కాట్ చేస్తుందని చెబుతున్నారు. ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యంగా జరగలేదంటూ ఇప్పటికీ వైసీపీ ఆరోపిస్తూ వస్తోంది. కౌంటింగ్‌ను కూడా బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానానికి పోటీచేసిన వైసీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి కౌంటింగ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్లు ఆంధ్రజ్యోతికి వెల్లడించారు. ఇక పులివెందులలో బుధవారం జరిగిన రీ పోలింగ్‌ను వైసీపీ బహిష్కరించింది. అయితే కౌంటింగ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్లు అధికారికంగా ఆ పార్టీ ప్రకటించలేదు. అధికార యంత్రాంగం కౌంటింగ్‌కు అవసరమయిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్‌లు మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీలోని కౌంటింగ్ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. స్ట్రాంగ్‌రూముల్లో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచారు. ఓట్ల లెక్కింపు సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏజెంట్లు కౌంటింగ్ ప్రక్రియ పరిశీలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే మైక్రో అబ్జర్వర్లు కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ ఇచ్చారు.

పారదర్శకంగా కౌంటింగ్ చేపట్టాలి

● సిబ్బందికి శిక్షణలో జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించారు. మంగళవారం రిమ్స్ సమీపంలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జడ్పీటీసీ ఉప ఎన్నికల కౌంటింగ్ గురువారం ఉదయం 8గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. పులివెందుల ఉపఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి 10 టేబుళ్లు, 1 రౌండ్‌లో ఫలితాలు లెక్కిస్తామన్నారు. అలాగే ఒంటిమిట్ట ఉపఎన్నికలకు 10 టేబుళ్లు, 3 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఒక్కో టేబుల్‌కు ఓ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్ల చొప్పున సూపర్‌వైజర్లు 30 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 60 మంది, స్టాటికల్ అధికారులు ముగ్గురు ఇతర సిబ్బంది కలిపి దాదాపు 100 మంది ఉంటారన్నారు. అందరూ కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీ సీఈవో ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి ఓబులమ్మ, ఏఆర్వోలు రంగస్వామి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అరెస్టు

ఎర్రగుంట్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డిని బుధవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. తెల్లవారుజామున ఆయనను అరెస్టు చేసేందుకు పోలీసులు నిడిజువ్విలోని ఆయన ఇంటికి వెళ్లారు. ఆయన ఆ సమయంలో ఇంట్లో లేరు. దీంతో సాయంత్రం సీఐ నరేశ్ ఆధ్వర్యంలోని పోలీసులు ఆయనను నిడిజువ్విలోని గృహంలోనే అదుపులోకి తీసుకుని ఎర్రగుంట్ల పోలీసుస్టేషన్‌కు తరలించారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా మంగళవారం కడప ఎంపీ అవినాశ్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి తీసుకెళుతుండగా ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలి వద్ద సుధీర్‌రెడ్డి వైసీపీ కార్యకర్తలతో కలసి వాహనాన్ని అడ్డుకుని ఎంపీని నిడుజువ్వికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ సుధీర్‌రెడ్డిపై కేసునమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి మొత్తం 30మందిపై కేసునమోదు చేసినట్లు తెలిసింది.

'అన్నమయ్య'లోకి పుంగనూరు

● మదనపల్లె రెండు మండలాలు.. కొత్తగా అర్బన్
● మంత్రివర్గ ఉపసంఘానికి ప్రతిపాదనలు

రాయచోటి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో ఉన్న పుంగనూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలను అన్నమయ్య జిల్లాలో కలిపేందుకు మంత్రివర్గ ఉప సంఘానికి ప్రతిపాదనలు అందాయి. గత వైసీపీ ప్రభుత్వం కొత్తగా జిల్లాల ఏర్పాటులో రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డగోలుగా జిల్లాలను విభజించిందని ఆరోపణలు వచ్చాయి. ఎన్నో నియోజకవర్గాలను, మండలాలను ప్రజల సౌకర్యంతో సంబంధం లేకుండా ఇష్టమొచ్చినట్లు జిల్లాల్లో కలిపారు. వీటిపై అప్పట్లో ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకతలు వచ్చినా వాటిని అప్పటి జగన్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. గత ఎన్నికల సందర్భంగా జిల్లాల ఏర్పాటులో ఏర్పడిన సమస్యలను పరిష్కరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ప్రభుత్వం ఐదుగురు మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. బుధవారం సబ్ కమిటీ విజయవాడలో సమావేశమై వీటిపై చర్చించింది. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో ఉన్న పుంగనూరు నియోజకవర్గం రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఉంది. ఈ లెక్కన పుంగనూరు అన్నమయ్య జిల్లాలో ఉండాల్సి ఉంది. అయితే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్తూరు జిల్లాపై తన పట్టు నిలుపుకునేందుకు పుంగనూరును చిత్తూరు జిల్లాలోనే ఉంచారని ఆరోపణలు వచ్చాయి.

ప్రస్తుతం పుంగనూరు నియోజకవర్గంలో పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచర్ల, రొంపిచెర్ల మండలాలను అన్నమయ్య జిల్లాలో కలపాలని మంత్రివర్గ ఉపసంఘానికి ప్రతిపాదనలు అందాయి. అదేవిధంగా ప్రస్తుతం మదనపల్లె మండలాలన్ని అదనంగా అర్బన్ మండలంగా విభజించనున్నారు. ఈ మేరకు మంత్రివర్గ ఉపసంఘానికి ప్రతిపాదనలు అందాయి.

పులివెందుల ప్రజలు అంబేడ్కర్ రాజ్యాంగం కోరుకుంటున్నారు

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత



మీడియా సమావేశంలో పాల్గొన్న మంత్రి సవిత, ఎమ్మెల్యే ఆది, బీటెక్ రవి తదితరులు

పులివెందుల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రజలు అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కోరుకుంటున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో రీపోలింగ్‌ను ఉద్దేశించి మంత్రి విలేకరులతో మాట్లాడారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా జరిగిన విషయం అందరికి తెలిసిందే అన్నారు. వారు ఓడిపోతామనే స్పష్టమైన సంకేతాలు రావడంతో పోలింగ్‌ను బహిష్కరిస్తున్నామని అన్నారన్నారు. 15 పోలింగ్ కేంద్రాలలో రీపోలింగ్ అడిగిన ఎంపీ బుధవారం రెండు పోలింగ్ కేంద్రాలలో రీపోలింగ్ ప్రారంభిస్తే దాన్ని కూడా బాయ్‌కాట్ చేస్తున్నామని అనడం ఎందుకో అర్థం కాలేదన్నారు. ఎన్నడూ చూడని స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకున్నామని ప్రజలు చెబుతున్నారన్నారు. జగన్, అవినాశ్ గతంలో వారు చేసింది మరచి మాట్లాడుతున్నారన్నారు. వారి హయాంలో కనీసం నామినేషన్ దాఖలు చేయలేని పరిస్థితి చూశామన్నారు.

అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి మాట్లాడుతూ రీపోలింగ్ కావాలని అడిగేది వారే బాయ్‌కాట్ చేసేది వారే అని ఎద్దేవా చేశారు. రీపోలింగ్ నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమైనపుడు రాజకీయ పార్టీలు వాటిపై మళ్లీ విమర్శించడం సరైన పద్ధతి కాదన్నారు. అవినాశ్‌రెడ్డికి ప్రజాస్వామ్యంపైన విశ్వాసం లేదన్నారు. వారి పాలనలో సాగినవిధంగా ఎన్నికలు నిర్వహిస్తేనే ఆయనకు సమ్మతంగా ఉంటుందన్నారు. వీరి గురించి ప్రజలందరికి తెలుసు కాబట్టే టీడీపీని గెలిపించబోతున్నారని చెప్పారు.

పూడికలో మేశారు

● రూ.1.21 కోట్ల పనులకు రూ.84 లక్షల మేర బిల్లులు
● కాలువల్లో ఎట్లుండే మురుగు అట్లనే
● కాంట్రాక్టర్లకు కాసుల పంట
● జేబులు నింపుకున్న అధికారులు
● పక్కదారి పట్టిన డీటీసీపీ నిధులు



మడూరు చానల్లో వ్యర్థాలు



అర్చన సినిమా హాలువద్ద కాలువలో పేరుకున్న మురుగు



సార్వకట్ట వీధిలోని ప్రొద్దుటూరు చానల్లో పేరుకున్న మురుగు

ప్రొద్దుటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ప్రధానంగా ప్రజలు ఎదుర్కొనే సమస్యల్లో పారిశుధ్యం, దోమలు బెడద ముఖ్యమైనవి. దోమల ఉత్పత్తిని అరికట్టడానికి ప్రధాన కాలువల్లో పేరుకున్న పూడికను తొలగించే పనులకు చంద్రబాబు ప్రభుత్వం వచ్చీరాగానే శ్రీకారం చుట్టింది. ఇందుకోసం డీటీసీపీ (డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) నుంచి రాష్ట్రంలో 106 మున్సిపాలిటీలకు 2024 జులై 24న రూ.50 కోట్లమేర నిధులు నేరుగా జమచేసింది. ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి జనాభా ఆధారంగా రూ.121.46 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులతో పట్టణంలోని ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులు గత ఏడాది ఆగస్టులో టెండర్లు నిర్వహించారు. కాంట్రాక్టర్లు అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య చేసిన పనులు కూడా నిబంధనల మేరకు చేపట్టలేదు. కాలువల్లో కట్టలు కట్టి నీళ్ల తొలగించి అడుగు వరకు ఉన్న పూడిక తీయకుండా కేవలం నీళ్లలో యంత్రాతో తోడి పనులు అస్తవ్యస్తంగా చేపట్టారు. ఈ పనులు కాంట్రాక్టర్లుకు, అధికారులకు కాసుల పంట పండించాయి తప్ప ప్రజలకు దోమల బెడదను, మురుగు సమస్యను తొలగించలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.1.21.46 కోట్లతో పూడికతీత పనులు

ప్రొద్దుటూరులోని మురుగు కాల్వల్లో పూడిక తొలగించడానికి గత ఏడాది ఆగస్టులో టెండర్లు జరిగినా పనులు అక్టోబరు నుంచి డిసెంబరు వరకు చేపట్టారు. ఇందులో దొరసానిపల్లె చానల్‌కు రూ.17 లక్షలకు గాను రూ.12,87 లక్షల మేర పనులు పూర్తి చేసినట్లు బిల్లులు చేసుకున్నారు. అలాగే ప్రొద్దుటూరు చానల్-2లో రూ.21.04 లక్షలకు రూ.4.74 లక్షల మేర, మడూరు చానల్‌లో రూ.36 లక్షలకు రూ.22.78 లక్షల మేరకు పనులు పూర్తి చేశారు. కొత్తపల్లె చానల్‌లో రూ.17.04 లక్షలకు రూ.14.82 లక్షల మేర పనులు చేపట్టారు. ప్రొద్దుటూరు చానల్-1లో రూ.10.38 లక్షలకు గాను రూ.4.17 లక్షల పనులు చేపట్టారు. మాన్యువల్‌గా మనుషులతో రూ.20 లక్షల మేర పనులకు రూ.8.92 లక్షల పనులు నిర్వహించారు. మొత్తం రూ.121.46 కోట్లకు గాను రూ.84,16,376.58 మేర పనులు చేపట్టి బిల్లులు చేసుకున్నారు. ఇంకా దాదాపు ఇంకా రూ.35 లక్షల మేర నిధులు ఉన్నాయి. అయితే.. రూ.84.16 లక్షల పనులు పూర్తి చేశామని అంటున్నారే కానీ.. పూడిక తీత పనులు నిబంధనల ప్రకారం చేపట్టలేదు. కాలువల్లో ఉన్న నీళ్లను మోటార్లు పెట్టి దిగువకు తరలించకుండా పూడిక తీయడంతో కేవలం చెత్తచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగాయి తప్ప అడుగున పేరుకున్న పూడిక బయటికి రాలేదు. కేవలం ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలు తీసేందుకు ఇన్ని లక్షలు వెచ్చించాలా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

జేబులు నింపుకున్నారు

కాంట్రాక్టర్లు కాలువల్లో మిషను, ట్రాక్టర్ వెళ్లే చోట మాత్రమే పూడిక తీశారు. నిబంధనల ప్రకారం మురుగునీటిని తొలగించి కాలువలో పేరుకున్న పూడికను తీయించాల్సి ఉంది. ఇలా చేయకపోవడంతో నెలలు గడవకముందే అదే కాలువల నిండా మురుగు పేరుకుపోయి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. ఈ పనులతో కాంట్రాక్టర్లు, మురుగు తొలగించే పనులు రికార్డు చేసే మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల్లో కొందరు బాగా జేబులు నింపుకున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. మురుగునీటి కాలువల్లో కట్టలు వేసి నీటిని తోడి పూడిక తీయమని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అనేక మార్లు మున్సిపల్ అధికారులకు తెలిపినా ఎక్కడా ఆ తరహాలో పనులు చేపట్టలేదు. దీంతో మళ్లీ కాలువలు వ్యర్థాలతో నిండి చిన్న వర్షం రాగానే మురుగునీరు రోడ్లపైకి పొంగి పొర్లుతోంది.

పాత పనులపై నేనేమీ చెప్పలేను

గత ఏడాది కాలువల్లో పూడిక తీత పనులు ఎలా జరిగాయనేది చెప్పలేను. నేను వచ్చి రెండు నెలల అయింది. కాలువల్లో కట్టలు కట్టి నీళ్లు తోడేసి పూడిక తీస్తే మళ్లీ కొన్నేళ్ల వరకు పేరుకోదు. మురుగునీటి ప్రవాహం కూడా సజావుగా ఉంటుంది. పట్టణంలో డిస్పోజబుల్ పాయింట్‌లేక ఇబ్బందులు ఉన్నాయి. కానీ పంచాయతీలో అనుమతులు తీసుకుని అక్కడ కచ్చాకాలువ తీసి పూడిక తొలగించవచ్చు. ఆ దిశగా చేసివుంటే మళ్లీ ఇప్పుడు ఇబ్బందులు వచ్చేవి కాదు.

\- ఎం.శ్రీనివాసులు, మున్సిపల్ ఈఈ, ప్రొద్దుటూరు

కాంగ్రెస్‌తో కలవనున్న జగన్

● ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలతో మంతనాలు : ఎమ్మెల్సీ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్‌తో కలవనున్నారని, ఈ మేరకు ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలతో మంతనాలు జరుపుతున్నారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్సీ పులివెందులలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ.. పులివెందులలో ప్రజాస్వామ్యబద్ధంగా జడ్పీటీసీ ఎన్నికలు జరిగితే జగన్ మాత్రం ఇక్కడ ఏవో అక్రమాలు జరిగినట్లు సుదీర్ఘంగా మాట్లాడారన్నారు. టీడీపీకి 25శాతం ఓట్లు వస్తున్నాయని జగన్ చెబుతున్నారన్నారు. మొన్న జరిగిన ఎమ్మెల్యే ఎన్నికలలో రాగిమానుపల్లెలో వైసీపీకి 644 ఓట్లు వస్తే టీడీపీకి 90 మాత్రమే వచ్చాయన్నారు. నల్లగొండువారిపల్లెలో 440 ఓట్లు వస్తే టీడీపీకి 50ఓట్లు వచ్చాయన్నారు. ఇలా చాలా చోట్ల తక్కువ ఓట్లు వచ్చాయన్నారు. అంటే అప్పుడు 25శాతం ఓట్ల కంటే టీడీపీకి తక్కువ వచ్చాయని అర్థమవుతోందన్నారు. జగన్ హయాంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగి ఉంటే ఇక్కడ టీడీపీకి 25 శాతం ఓట్లు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. జగన్ మాట్లాడేది ఒకటి చేసేది మరొకటి అన్నారు. అందులో భాగంగానే కాంగ్రెస్‌తో కలిసి పనిచేసేందుకు జగన్ రహస్య మంతనాలు చేస్తున్నారన్నారు. జరిగింది జరిగిపోయింది ఇపుడు అందరం కలిసి పనిచేద్దామని జగన్ ప్రతిపాదన చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం జగన్ కాంగ్రెస్‌తో ముందుకెళ్తారన్నారు. ఇటీవల షర్మిలను కూడా మారుస్తారనే వార్తలు వస్తున్నాయన్నారు. ఇది జగన్ ప్రతిపాదనతోనే సాగుతోందన్నారు.

రౌద్రాల అంకాళమ్మ ఆలయ చైర్మన్‌గా కోడి రామకృష్ణారెడ్డి


కోడి రామకృష్ణారెడ్డి

పీలేరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పీలేరు గ్రామ దేవత అయిన రౌద్రాల అంకాళమ్మ ఆలయ పాలకమండలి అధ్యక్షుడిగా ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు విశ్రాంత మేనేజర్ కోడి రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర దేవదాయ శాఖ నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. తనతో పాటు మరో 9 మందిని ప్రభుత్వం సభ్యులుగా నియమించిందని, త్వరలోనే తాము ప్రమాణస్వీకారం చేస్తామని ఆయన తెలియజేశారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి


రామచంద్రరాజు(ఫైల్)

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మా. దవరంపోడు పంచాయతీ పరిధి ప్రధాన జాతీయ రహదారి వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ ఉపాధ్యాయుడు రామచంద్రరాజు (60) మృతి చెందాడు. రైల్వేకోడూరు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ వివరాల మేరకు... కోడూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రామచంద్రరాజు మంగళవారం అర్ధరాత్రి ఆటోలో కోడూరు నుంచి మాధవరంపోడు గ్రామానికి చేరుకుని రోడ్డు దాటుతుండగా రాజంపేట నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు వెంటనే స్థానికులు కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య మాధవరంపోడులో అంగన్‌వాడీ వర్కర్‌గా పనిచేస్తోంది.

మహిళ మృతిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మహిళ అనుమానాస్పదంగా మృతి చెందడంతో ఆమె తండ్రి ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఆయన మాట్లాడుతూ టి. సదుం పంచాయతీ రామాపురం వాసి వెంకటరమణ కుమార్తె మలిశెట్టి రత్నమ్మ (30) మదనపల్లెలోని మెడికల్ షాపులో పనిచేస్తుండేది. నిమ్మనపల్లి మండలం కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజిగారిపల్లికు చెందిన బాల్లాపురం జ్యోతిశేఖర్ ఆమెను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు మునిష్కరనందన్ (2) ఉన్నాడు. అయితే భర్త పెయింటింగ్ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చేసరికి రత్నమ్మ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే స్థానికుల సాయంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. దీంతో తండ్రి వెంకటరమణ ఫిర్యాదుతో అనుమానాస్పద కేసుగా నమోదు చేశామన్నారు.

ఇళ్లను త్వరగా పూర్తి చేయండి


ఇళ్లను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్

నిమ్మనపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెండింగ్ వున్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని ప్రత్యేక అధికారి సతీశ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక దండువారిపల్లిలో ఉన్న లేఅవుట్‌ను ఎంపీడీవో రమేశ్‌తో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడుతూ లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు సరైన సమయానికి నిర్మించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అదనంగా డబ్బు మంజూరు చేసినా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేకపోవడం అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు తప్పనిసరిగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారుల్లో చైతన్యం తెచ్చి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. పనులు సక్రమంగా చేయని అధికారులకు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఆత్మలు ‘ఉపాధి’ పనులు చేశాయి...!

- చనిపోయిన వ్యక్తుల పేరిట బిల్లులు
- టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌ల సస్పెన్షన్
- గోకులం బిల్లుకు రూ.10 వేలు లంచం
- దొంగ మస్టర్లతో బిల్లులు స్వాహా
- సామాజిక తనిఖీలో వెలుగులోకి...

గుర్రంకొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చనిపోయిన వ్యక్తుల ఆత్మలు వచ్చి గుర్రంకొండ మండలంలో ఉపాధి హామీ పథకంలో పనులు చేశాయి. ఈ ఆత్మలు కూడా వారం రోజుల పాటు ఉపాధి పథకంలో వంక పనులు, చెరువులో పూడికతీత పనులు, పండ్ల తోటల పనులు చేయడం విశేషం. గ్రామాల్లో పాడి రైతుల కోసం నిర్మించిన గోకులాల్లో అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు తనిఖీ బృందం బహిరంగ సభలో వెల్లడించింది. అంతేకుండా గోకులం షెడ్‌కు బిల్లు మంజూరు చేయాలంటే రూ.10 వేలు లంచం ఇచ్చినట్లు టీడీపీ సీనియర్ నేత జిల్లా అధికారులకు సమావేశంలో ఫిర్యాదు చేయడం ఉపాధి సిబ్బంది అవినీతి, అక్రమాలకు నిదర్శనంగా మారింది. అలాగే ఉపాధి పనుల్లో కూలీలు పనులు చేయకనే బినామీ పేర్లతో బిల్లులను డ్రా చేసినట్లు తనిఖీ బృందం గుర్తించింది. అంతేకాకుండా దొంగ మస్టర్లతో పలు గ్రామాల్లో బిల్లులు స్వాహా చేసినట్లు సామాజిక తనిఖీలో వెల్లడైంది.

గుర్రంకొండ మండలంలోని ఉపాధి హామీ పథకంలో వివిధ రకాల పనులు చేశారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి రూ.5.50 కోట్లు ఖర్చు చేశారు. ఈ నిధులతో రైతుల పొలాల్లో పండ్ల తోటల పెంపకం, పూడికతీత పనులు, చెరువుల్లో పూడికతీత పనులు, వంక పనులు, ట్రెంచ్ పనులు, సీసీ రోడ్లు, గోకులం షెడ్లను నిర్మించారు. ఈ పనులను సామాజిక తనిఖీ బృందం పది రోజులపాటు గ్రామాల్లో తిరిగి ప్రతి పనిని తనిఖీ చేసి అవినీతి, అక్రమాలను బుధవారం డ్వామా పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సభలో వెల్లడించారు. ఇందులో భాగంగా మండలంలోని సరిమడుగు పంచాయతీలో ఉపాధి హామీ పనులను రెండేళ్ల క్రితం చనిపోయిన వ్యక్తులు చేసినట్లు చూపి బిల్లులను డ్రా చేశారు. గ్రామానికి చెందిన చిన్నరమణ 2023వ సంవత్సరం, రెడ్డెమ్మ 2021లో చనిపోయారు. వీరిద్దరూ ఉపాధి హామి పథకంలో 2024వ సంవత్సరంలో పనులు చేసినట్లు చూపి బిల్లులను డ్రా చేసినట్లు తనిఖీ బృందం వెల్లడించింది. అలాగే శెట్టివారిపల్లె పంచాయితీలో నిర్మించిన రెండు గోకులాలు బినామీ పేర్లతో నిర్మించినట్లు సామాజిక తనిఖీ బృందం వెల్లడించడంతో బినామీలకు, రైతులకు వాగ్వాదం జరిగింది. దీంతో రెండు గోకులాల నిర్మాణాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఏపీడీ మధుబాబును పీడీ ఆదేశించారు. అలాగే టి.రాచపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీ సింగిల్ విండ్ చైర్మన్ మహాత్మారెడ్డి తన భార్య పేరిట గోకులం షెడ్ మంజూరైతే బిల్లు చేయడానికి టీఏ మదన్‌మోహన్‌రాజుకు రూ.10 వేలు లంచం ఇచ్చినట్లు పీడీకి ఫిర్యాదు చేశాడు. అలాగే మర్రిపాడు, రామాపురం, ఎల్లుట్ల, సరిమడుగు. చెర్లోపల్లె, టి.పసలవాండ్లపల్లె గ్రామాల్లో దొంగ మస్టర్లను వేసి బిల్లులు డ్రా చేసినట్లు తనిఖీ బృందం తెలిపింది. అలాగే గుర్రంకొండ పంచాయతీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పనులు చేసినట్లు చూపి నిధులు స్వాహా చేసినట్లు గుర్తించారు. గుర్రంకొండ, టి.పసలవాండ్లపల్లెలో హౌసింగ్ బిల్లులను లబ్ధిదారుల పేరిట కాకుండా బినామీ వ్యక్తుల ఖాతాలోకి జమ చేసినట్లు తెలిపారు. అలాగే వివిధ గ్రామాల్లో జరిగిన చెరువులకు నీరు చేరే వంక పనుల్లో పని పరిమాణం తక్కువగా ఉన్నట్లు తెలిపారు. ఈ పనులకు సంబంధించి దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలని ఆదేశించారు. అలాగే పలు గ్రామాల్లో ఏపీవో జయరామిరెడ్డి మస్టర్లను తనిఖీ చేయకపోవడంతో అవినీతి, అక్రమాలు జరిగినట్లు తనిఖీ బృందం తెలిపింది.


గోకులాల నిర్మాణాల్లో అక్రమాలను వెల్లడిస్తున్న డీఆర్పీ మణికంఠ

ఇద్దరు ఉపాధి సిబ్బంది సస్పెన్షన్

గుర్రంకొండ మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. సరిమడుగు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ పూజిత, టెక్నికల్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రాజులను సస్పెండ్ చేసినట్లు పీడీ తెలిపారు. అలాగే వివిధ పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాల నుంచి రూ.7 వేలు రికవరీ చేయగా 8 వర్క్ ఐడీలో జరిగిన పనులపై విచారణ చేయాలని ఏపీడీ మధుబాబును ఆదేశించారు. మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో రూ.2,39,372 లక్షలు అవినీతి జరిగినట్లు పీడీ తెలిపారు.

కాటమరాజు స్థల పట్టా రద్దు చేయండి

- స్థలాన్ని గుడి ఉత్సవానికి కేటాయించండి: కలెక్టర్ శ్రీధర్


కాటమరాజు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

గాలివీడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాటమరాజు ఉత్సవానికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తి పట్టాను రద్దు చేసి తిరిగి గుడి ఉత్సవాలకే కేటాయించాలని తహసీల్దార్ భాగ్యలతను కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. నూలివీడు పంచాయతీ నాగూరివాండ్లపల్లెకు సమీపంలో గత కొన్ని వందల సంవత్సరాలుగా సంక్రాంతి నాడు చిట్లాకుప్ప వేసుకునే కాటమరాజు ఉత్సవ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన వేరే వ్యక్తి డీకేటీ పట్టా చేయించుకుని దాని చుట్టూ కంచె వేసిన విషయాన్ని ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్‌తో కలిసి కలెక్టర్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు కలెక్టర్‌తో మాట్లాడుతూ మా ఊరు పుట్టినప్పటి నుంచి ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ రోజు అంగరంగ వైభవంగా కాటమరాజు ఉత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఈ స్థలాన్ని ఇదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తెలియకుండా డీకేటా పట్టా చేయించుకుని ఉత్సవం జరుపుకోవడానికి కూడా అవకాశం లేకుండా చుట్టూ కంచె వేశాడని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ కాటమరాజు స్థలాన్ని ఆక్రమించుకున్న కుటుంబ సభ్యులకు ఎన్ని ఎకరాల వరకు డీకేటీ పట్టా ఉంది, ఎంతమంది పేర్ల మీద డీకేటీ ఉన్నది అనే విషయాన్ని పరిశీలించి వెంటనే పట్టా రద్దు చేయడానికి తగిన ప్రతిపాదనలు తమకు పంపాలని తహసీల్దార్‌కు తెలిపారు. ఎక్కడ కూడా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కాటమరాజు స్థల వివాదానికి సంబంధించి తమ దృష్టికి వచ్చిందని, తాను ఇరుపక్షాలతో మాట్లాడి ఉత్సవాన్ని జరుపుకోవడానికి స్థలం ఇవ్వాలని తాను కూడా వారికి తెలియజేసినట్లు తహసీల్దార్ కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భార్య మృతి కేసులో భర్తకు పదేళ్ల జైలుశిక్ష

- రాజంపేట మూడవ ఏడీజే కోర్టు తీర్పు


నందలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : వరకట్న మరణం కేసులో ముద్దాయి పామూరు సాయివర్ధన్‌కు రాజంపేట మూడవ ఏడీజే కోర్టు జడ్జి ప్రవీణ్‌కుమార్ 10 సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నందలూరులోని బ్రాహ్మణవీధికి చెందిన పామూరి సాయివర్ధన్ తన భార్య అయిన పామూరి లక్ష్మీప్రసన్న (22)ను అదనపు కట్నం కోసం వేధించడంతో భర్త వేధింపులు భరించలేక 2023 మార్చి 29వ తేదీ తన చున్నీతో ఉరివేసుకుని చనిపోయింది.

మృతురాలి తండ్రి రావూరు కనకరత్న ఆచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి నందలూరు ఏఎస్ఐ జేవీ సుబ్బరాయుడు కేసు నమోదు చేశారన్నారు. అప్పటి రాజంపేట డీఎస్పీ జి.శివభాస్కర్ రెడ్డి, మరో డీఎస్పీ వీఎన్‌కే చైతన్య సాక్షులను విచారించి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారని తెలిపారు. దీనిపై రాజంపేట మూడవ ఏడీజే కోర్టు జడ్జి విచారణ జరిపి ముద్దాయికి పదేళ్ల జైలుశిక్ష విధించారని ఎస్ఐ తెలిపారు.


పోలీసుల అదుపులో ముద్దాయి సాయివర్ధన్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పింఛా ప్రాజెక్టులో పెరుగుతున్న నీటిమట్టం



సుండుపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పింఛా ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టులో నీటిమట్టం 997 అడుగుల వరకు చేరుకోగా, పై ప్రాంతాల నుంచి సుమారు 300 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వస్తున్నట్లు ప్రాజెక్టు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దిగువ ప్రాంతాలకు 12 క్యూసెక్కుల నీరు కాలువల ద్వారా విడుదల చేసినట్లు వివరించారు. బుధవారం ఉదయం నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో పై ప్రాంతాల నుంచి నీరు వచ్చే అవకాశం ఉందని, ప్రాజెక్టు దిగువ భాగంలోని ముడుంపాడు, నగిరి, కురవపల్లి, తొగురుపల్లి, టమటంవారిపల్లె, పెద్దినేనికాలువ హరిజనవాడ, రాగిమానుబిడికి, చిన్నబిడికి, పెద్దబిడికి, రాచపల్లి, రాయవరం రెడ్డివారిపల్లె, బాలాజీబిడికి, మిట్టబిడికి ప్రాంతాల ప్రజలు నదీ పరివాహక ప్రాంతానికి వెళ్లకూడదని హెచ్చరించారు. ఏ సమయంలోనైనా ప్రాజెక్టు నుంచి పింఛా నదిలోకి నీటిని విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ప్రజలు గుర్తించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా, నది పరివాహక ప్రాంతానికి వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు.

కడప జిల్లా కోర్టు పీపీ పోస్టు అనంతపురం బదిలీ

కలికిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కడప ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి కోర్టులో ప్రస్తుతమున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టును అనంతపురం జిల్లా కోర్టుకు బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప పీపీ పోస్టును ప్రస్తుతమున్న కేడర్ నుంచి ఇతరత్రా మార్పు చేయదలచిన దృష్ట్యా ఈ బదిలీ జరిగినట్లు ప్రభుత్వం పేర్కొంది. దీంతో కడప కోర్టులో నిర్దిష్ట కాల వ్యవధితో పీపీ నియామకం చేపట్టనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అడ్డం పేరుతో అడ్డు తొలగిస్తున్నారు

- నేల కొరుగుతున్న మహావృక్షాలు
- వాల్టా చట్టం అపహాస్యం..
- గుట్టుగా కలప తరలింపు

మదనపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): 'మొక్కలు నాటుదాం..పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, మొక్కలు పెంచుదాం..ఆరోగ్యాన్ని పంచుదాం, అమ్మ పేరుతో ఒక మొక్క, ఇంటింటా చెట్టు..ఊరూరా వనం' అనే నినాదాల పేరుతో ప్రభుత్వాలు మొక్కలు పెంచాలని చెబుతున్నాయి. అడవుల సంరక్షణ, మొక్కల పరిరక్షణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామం, పట్టణాల్లో విస్తృతంగా ప్రచారం, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాయి. పైగా వాల్టా చట్టాన్ని కూడా అమలు చేస్తోంది. అయితే ఇదంతా ప్రచారం, చట్టాలు కాగితాలకే పరిమితం అయ్యాయే కానీ క్షేత్రస్థాయిలో మచ్చుకైనా కనిపించలేదు. ఇంటా బయటా, గట్టు గుట్టా, భూమి-పొలం ఇలా అనేక చోట్ల నిత్యం చెట్ల నుంచి భారీ వృక్షాల వరకు నేలకొరుగుతున్నాయి. వివిధ అవసరాలు, భూముల అభివృద్ధి, రియల్ ఎస్టేట్ వ్యాపారం.. కారణం ఏదైనా అడ్డం పేరుతో వృక్షాలను అడ్డు తొలగిస్తున్నారు. చెట్టు, వృక్షం తొలగింపు తప్పనిసరైతే అటవీశాఖ అనుమతి తప్పనిసరి. అందుకు అటవీశాఖ నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి చెట్టు, వృక్షం విలువ చెల్లించి అందుకు రెట్టింపుగా మొక్కలు నాటాల్సి ఉంది. అదేమీ లేకుండా చెట్లు కట్ చేసే ఏజెంట్లతో ఒప్పందం కుదుర్చుకుని కోసేసి వాటిని షామిల్లులకు తరలిస్తున్నారు.


మదనపల్లె-బెంగళూరు రోడ్డులో నేలకొరిగిన మర్రి వృక్షం, కలపను ట్రాక్టర్‌కు నింపుతున్న కూలీలు (ఫైల్)


నేలకొరిగిన చింత వృక్షం

పెద్ద పెద్ద వృక్షాలను ఎక్కడో అడవులు, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఎవరికీ తెలియదు అనుకోవచ్చు. పల్లె-పట్టణం, రాత్రి-పగలు అనే తేడా లేకుండా యంత్రాలతో నేలకూలుస్తున్నారు. వృక్షాలను కోయడానికే వ్యాపారులు, కాంట్రాక్టర్లు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వీరికి ఎలాంటి అనుమతులు లేకపోయినా రైతులు, వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకుని కట్ చేస్తున్నారు. ఇందులో భాగంగా మదనపల్లె పట్టణం బెంగళూరు రోడ్డులో అయిదు రోజులుగా రెండు చోట్ల వృక్షాలను కోసేస్తున్నారు. వేపమాను కేంద్రం సమీపంలో ఒకచోట, రెడీఫుడ్స్ ఎదురుగా మామిడితోటలో దర్జాగా పని కానిస్తున్నారు. అటవీశాఖ పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా శబ్దం లేని రంపాలతో నేల కూల్చేస్తున్నారు. ఇందులో భారీ మర్రి, చింత, వేప, అల్లనేరేడు, మామిడి, తదితర చెట్లు ఉన్నాయి. ఈ రెండుచోట్లా ఇప్పటికే పదుల సంఖ్యలో చెట్లు నేలకూలగా మరిన్ని సిద్ధంగా ఉన్నాయి. పట్టణం, ప్రధాన రహదారుల్లోనే పరిస్థితి ఇలా ఉంటే..మారుమూల అటవీ, గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. వృక్షాల కోతను నివారించాలంటే కలప మిల్లులు, వీటిని కట్ చేసే ఏజెంట్లపై నిఘా పెట్టడంతో పాటు వారికి తగిన స్థాయిలో అంక్షలు విధించాలని పర్యావరణ ప్రేమికులు, స్థానికులు కోరుతున్నారు.


తరలించడానికి సిద్ధం చేసిన కలప మొద్దులు

వాటికి అనుమతి లేదు

బెంగళూరు రోడ్డులోని రెండు ప్రాంతాల్లో చెట్లు కోస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. భూమి యజమానులతో పాటు వాటిని కట్ చేసే వారిపై కూడా కేసులు నమోదు చేసి, అపరాధం విధిస్తాం. ఇప్పటికే మా సిబ్బందిని అక్కడికి పంపించి ఆపేశాం, చర్యలు తీసుకోమని ఆదేశించాం.

- ప్రసాద్‌రావు, అటవీ శాఖాధికారి, మదనపల్లె.

జడ్‌హెచ్‌డీసీ భూముల ఆక్రమణ

ఆ భూముల్లో హైవే వెళుతుండటంతో అక్రమార్కుల కన్ను


జడ్‌హెచ్‌డీసీ భూముల్లో ఆక్రమణదారులు వేసిన ముళ్లకంచె

ఓబులవారిపల్లె ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్నఓరంపాడు రెవెన్యూ పరిధిలోని పొలాల్లో సుమారు 800 ఎకరాల పైచిలుకు జెడ్‌హెచ్‌డీసీకి సంబంధించిన భూములు ఉన్నాయి. కొన్ని దశాబ్దాలుగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాల వారు పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కొంతమంది ప్రభుత్వం ద్వారా బోర్లు, మొక్కలు పొంది సాగు చేసుకుని జీవిస్తుండగా మరికొంతమంది పొలాల్లో భూగర్భజలాలు లేకపోవడంతో బీళ్లుగా మిగిలి ఉన్నాయి. ఇటీవల కడప-రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవే కారిడార్ రోడ్డు నిర్మాణం ఈ జడ్‌హెచ్‌డీసీ భూముల గుండా వెళుతుండడంతో ఆ భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఎంతలా అంటే ఒక సెంటు విలువ రూ.100 కూడా చేయని చోటు వేలాది రూపాయలు పలుకుతున్నాయి.

ఇదే అదునుగా చేసుకుని కొంతమంది ఒకరి భూములు మరొకరి పేరుతో తారుమారు చేసి భూములు అమ్మి లక్షలాది రూపాయలు దండుకొన్నారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ద్వారా ఇచ్చిన పట్టాలు ఒకరికైతే అక్రమంగా మరొకరు సాగులో ఉంటున్నారు. వీటికి సంబంధించిన లబ్ధిదారులు మండల స్థాయి రెవెన్యూ అధికారులకు ఎన్నిమార్లు అర్జీ పెట్టుకున్నా కూడా పరిష్కారం కాకపోవడంతో జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసినా కూడా తూతూమంత్రంగానే వచ్చి వెళుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపలేదని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తమ వద్ద ప్రభుత్వం ద్వారా అందించిన పత్రాలు ఉన్నా నకిలీ పత్రాలు పొంది కొంతమంది దౌర్జన్యంగా భూములు సాగు చేసుకుంటూ దౌర్జన్యం చేస్తున్నారని, వీరిపై అధికారులకు ఫిర్యాదు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీనిపై కలెక్టర్ అయినా స్పందించి ఆక్రమణదారులకు అడ్డుకట్ట వేయాలని పలువురు ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు కోరుతున్నారు.

నిత్యపూజేశ్వర ఆలయ పాలకమండలి నోటిఫికేషన్ విడుదల

సిద్దవటం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిత్యపూజేశ్వర ఆలయ పాలకమండలిలో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 27 వరకు గడువు పొడిగిస్తూ దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేసినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నిత్యపూజేశ్వరకోన ఆలయ పాలకమండలి నియామకానికి దేవదాయ శాఖ అధికారులు ఈనెల 7న నోటిఫికేషన్ చేసినట్లు తెలిపారు. ఔత్సాహికులు ఈనెల 27వ తేదీ లోగా జిల్లా దేవదాయశాఖ అధికారి కడప కార్యాలయానికి తమ దరఖాస్తులు పంపాలని ఆయన తెలిపారు.

సైబర్... టెర్రర్

- ఇన్వెస్ట్‌మెంటు పేరుతో బురిడీ
- ఆశపడితే.. బ్యాంకుల్లో నగదు ఖాళీ
- ఏడు నెలల్లో 700 ఫిర్యాదులు
- రూ.15 కోట్లకు పైగా స్వాహా

కడప క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. సోషల్ మీడియాలో ఇన్వెస్ట్‌మెంటు పేరుతో నకిలీ యాప్‌లు ప్రవేశపెట్టి.. ఇందులో పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో డబ్బులు వస్తాయంటూ ఆశలు రేకెత్తించి కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు. ఇలాంటి మోసాలు జిల్లాలో రోజురోజుకు పెరిగిపోతున్నాయి.

ఇన్వెస్ట్‌మెంటు అంటే...

మనం పెట్టిన డబ్బులకు రెట్టింపు ట్రేడ్ తెస్తామంటూ పలురకాల యాప్‌లను సోషల్ మీడియా గ్రూపుల్లో పెడతారు. తొలుత నమ్మకం కలిగేలా కొందరికి రెట్టింపు డబ్బులు ఇస్తారు. వేలల్లో ఉన్న పెట్టుబడులను లక్షలు, కోట్లలో పెట్టేలా చేసి.. చివరికి ఆ యాప్‌ను మాయం చేస్తారు. దీంతో పెట్టుబడులు పెట్టిన వారంతా డబ్బులన్నీ పోగొట్టుకొని... చేతులు కాలాక ఆకులు పట్టు కున్నచందంగా... లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఎక్కడో ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ పేర్లు, నకిలీ ఐడీ ప్రూఫ్‌లతో ఈ దందా నడపడంతో సైబర్ నేరగాళ్లను పట్టుకోవడానికి పోలీసులు తలలు పట్టుకునే పరిస్థితి. కనీసం సైబర్ నేరగాళ్ల ఐడెంటిటీ కూడా ఎక్కడా కనిపించదు.

మోసపోయే వారంతా ఉద్యోగులు, విద్యావంతులే...

ఇన్వెస్ట్‌మెంటు దందాలో మోసపోతున్న వారిలో ఎక్కువగా ఉద్యోగులు, విద్యావంతులే ఉంటున్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, వాట్సప్, ఇన్‌స్ట్రాగ్రామ్, టెలిగ్రామ్‌లో వచ్చే యాప్‌లకు ఆకర్షితులై సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడిపోతున్నారు. లక్షల రూపాయలు ఇన్వెస్ట్‌మెంటు చేసి.. వారి ఖాతా వివరాలు చెప్పడంతో సైబర్ నేరగాళ్లు ఈజీగా డబ్బులు కొట్టేస్తున్నారు. ఇలా మోసపోతున్న ఘటనలు జిల్లాలో రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది ఏడు నెలల్లోనే దాదాపు 700 ఫిర్యాదులు వచ్చాయంటే ఏ స్థాయిలో సైబర్ నేరగాళ్ల మోసాలకు బలవుతున్నారో ఇట్టే తెలిసిపోతుంది. బాధితుల నుంచి దాదాపు రూ.15 కోట్లకు పైగా డబ్బులు స్వాహా చేయగా.. రూ.6కోట్లు వరకు పోలీసులు ఫ్రీజ్ చేశారు.



మోసపోయిన బాధితులు...

- కడపకు చెందిన ఓ ఉద్యోగి ఇన్వెస్ట్‌మెంటు యాప్ డౌన్‌లోడ్ చేసి.. రూ.20లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాడు. లాభాల మాట దేవుడెరుగు.. తాను చెల్లించిన డబ్బు సైతం పోగొట్టుకున్నాడు. చేసేదిలేక పోలీసులను ఆశ్రయించారు.
- కడపకు చెందిన ఓ మహిళా ఉద్యోగి దాదాపు రూ.3లక్షలు ఇన్వెస్ట్‌మెంటులో పెట్టుబడులు పెట్టి పోగొట్టుకుంది.
- ప్రొద్దుటూరుకు చెందిన ఓ వ్యాపారి, అలాగే అదే ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థి పెట్టుబడులుగా లక్షల్లో పెట్టారు. అయితే వారు తమ డబ్బులు తీసుకునేందుకు ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఫలి తం లేకపోవడంతో చివరికి పోలీసులను ఆశ్రయించారు.
- మైదుకూరు చెందిన పలువురు వ్యాపారులు ఓ వ్యక్తిని నమ్మి యాప్‌లలో లక్షల్లో పెట్టుబడు లు పెట్టారు. చివరికి ఎవరు స్పందించ కపోవ డంతో పెట్టుబడి పెట్టించిన వ్యక్తిపైనే వారు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా అత్యాశ కుపోయి ఆన్‌లైన్ మోసాలకు బలి కావద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి... ఎస్పీ అశోక్‌కుమార్



సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగించేందుకు రకరకాల పద్ధతులు అనుసరిస్తున్నారు. మీరు పెట్టే పెట్టుబడికి రెట్టింపు లాభాలు వస్తాయంటూ టెలిగ్రాం, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పోస్టులు పెట్టి మోసగిస్తున్నారు. ఈజీమనీ కోసం ఆశపడితే లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. ఇలాంటి వాటిని ప్రజలు నమ్మవద్దు. టెలిగ్రామ్, వాట్సప్ గ్రూపులకు ముందుగా ఇన్వెస్ట్ చేసి డబ్బు డబుల్ చేసుకోండి అంటూ లింకులు పంపుతారు. ఆ లింకులు ఓపెన్ చేసి వారు చెప్పినట్లు చేస్తే.. మొదట వెయ్యి, 2వేలకు డబుల్ లాభాలు వచ్చేలా చూపిస్తారు. ఇంకా ఎక్కువ పెడితే అధిక లాభాలు పొందుతారని నమ్మిస్తారు. ఆశపడి పెట్టుబడి పెట్టి మోసపోవద్దు. సెల్‌ఫోన్‌లకు వచ్చే ఎలాంటి అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయవద్దు. ఒకవేళ ఎవరైనా మోసపోయినట్లు గుర్తిస్తే సైబర్‌క్రైం సెల్ నెంబర్ 1930కు వెంటనే ఫిర్యాదు చేయాలి.

17న జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

ప్రొద్దుటూరుటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా జిల్లాస్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికలు, సీనియర్స్ పురుషులు, మహిళల బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు 17వ తేదీ నిర్వహించనున్నట్లు వైఎస్ఆర్ కడప జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.క్రిష్ణమూర్తి, కార్యదర్శి వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపా రు. సబ్ జూనియర్స్ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2010 జనవరి 2 తర్వాత జన్మించి ఉండాలన్నారు. సబ్‌జూనియర్స్, సీనియర్స్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29, 30, 31 తేదీల్లో ప్రకాశం జిల్లా చెపూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నా రు. జట్టు ఎంపికకు వచ్చే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, బ్లడ్‌గ్రూపు, డ్రస్‌కోడ్, షూ వేసుకుని రావాలని కోరా రు. వివరాలకు 9490181104 నెంబరులో సంప్రదించాలని కోరారు.

క్రిస్టియన్ వివాహాల నమోదుకు ముగ్గురు పాస్టర్ల నియామకం

కలికిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో క్రిస్టియన్ మతానికి చెందిన వివాహాలను నిర్వహించి.. అందుకు తగ్గ వివాహ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం కోసం ముగ్గురు పాస్టర్లను అధీకృతులుగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పది సంవత్సరాల పదవీ కాలంతో ఈ నియామకాలు చేపట్టారు. చట్టపరిధిలో ఆచారాల ప్రకారం మతపరమైన వివాహాలు నిర్వహించడానికి వీరికి అధికారం కల్పించారు. కడప రాజారెడ్డి వీధికి చెందిన భవనాసి సుధీర్‌ను రిడీమర్ చర్చికి, పులివెందుల నగరిగుట్టకు చెందిన కోట్లల్‌మ్యానియల్‌ను నగరిగుట్ట రాక్ ప్రేయర్ హౌస్ చర్చికి, పులివెందుల నగరిగుట్టకే చెందిన పాగల యేసయ్యను షలేమ్ ప్రేయర్ హౌస్ చర్చికి నియమించారు. ఈ మేరకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి సి.శ్రీధర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

పబ్లిక్ హెల్త్ వర్కర్ల డిప్యుటేషన్ రద్దు

ప్రొద్దుటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని 8 మంది పబ్లిక్ హెల్త్‌వర్కర్లు డిప్యుటేషన్‌పై పబ్లిక్ హెల్త్ మేస్త్రీలుగా గత కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి 8 మంది వర్కర్ల డిప్యూటేషన్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమేరకు రేపటి నుంచి పబ్లిక్ హెల్త్ వర్కర్లు ఆయా డివిజన్లలో స్వీపర్లుగా, డ్రైన్ క్లీనర్లుగా వెళ్లి పనులు చేయాలని అందులో పేర్కొన్నారు. డిప్యూటేషన్లు రద్దు అయిన మేస్త్రీలలో నాలుగు డివిజన్‌లకు చెందిన చైతన్య, మోషా, వినోద్, ప్రసాద్, సరస్వతి, ఎం.రమేష్, ఈ రమేష్, ఓబులేసు ఉన్నారు.

పెన్నానదిలో యువకుడు గల్లంతు

పెన్నానదిలో యువకుడి ఆచూకీ కోసం గాలిస్తున్న రెస్క్యూ టీం






విక్రమ్ (ఫైల్ ఫొటో)

ప్రొద్దుటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో గల పెన్నానదిలో మంగళవారం సాయంత్రం నాయుని విక్రమ్ (19) అనే యువకుడు గల్లంతయ్యాడు. వివరాల్లోకి వెళితే .. రామేశ్వరం మిట్టమడికి చెందిన విక్రమ్, మత్తయ్య, వెంకటసాయి, శివలింగమయ్య నలుగురు స్నేహితులు. వీరంతా కలిసి పెన్నానది వద్దకు నదిలోనీళ్ల ప్రవాహం చూడటానికి వెళ్లారు. విక్రమ్‌కు చెందిన చెప్పు నీళ్లలో పడటంతో నదిలోకి దిగి గల్లంతయినట్లు తల్లి రుక్మిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి వెల్లడించారు. సమాచారం తెలిసి రూరల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూటీంగా వెళ్లి మంగళవారం సాయంత్రం నుంచి పెన్నానదిలో విక్రమ్ ఆచూకి కోసం వెతికారు. నదిలో నీటిప్రవాహం ఉధృతంగా వుండటంతో బుధవారం సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదని పోలీసులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కడప క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆటోనగర్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు సిద్దవటం మండలం ఎగువపేటకు చెందిన వెంకటేశ్ (29) కడపలో ప్రైవేటు దుకాణంలో పని చేస్తున్నాడు. రాత్రి ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతున్న సమయంలో వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

20 టీఎంసీలకు చేరిన గండికోట నీటిమట్టం




గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి నీరు విడుదలవుతున్న దృశ్యం

కొండాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా.. బుధవారం 20 టీఎంసీలకు చేరినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 10,000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మైలవరం నుంచి పెన్నానదికి నీరు వదిలేందుకు ఈ నీటి ని విడుదల చేస్తున్నామన్నారు. కాగా బుధవారం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 13,900 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రాజెక్టులోకి 2700 క్యూసెక్కుల వర్షపునీరు వచ్చి చేరినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 11,200 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం పైడిపాలెం రిజర్వాయర్‌కు 400 క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు.

పెన్నానదికి కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతోందని మైలవరం జలాశయ అధికారులు తెలిపారు. బుధవారం మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి పది వేల క్యూసెక్కులు, ఉత్తర, దక్షిణ కాలువలకు నూరు క్యూసెక్కులు చొప్పున నీరు వదులుతున్నట్లు తెలిపారు. వర్షానికి మైలవరం జలాశయంలో ఇన్‌ఫ్లో ఇంకా పెరిగితే పెన్నానదికి వదిలే అవకాశం ఉన్నందున పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మైలవరం జలాశయం పూర్తి నీటి నిలువ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుం జలాశయంలో 5.4 టీఎంసీల నీరు నిలువ ఉంది.

పరవళ్లు తొక్కుతున్న కుందూ నది



చాపాడు బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది

చాపాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో కుందూ నది పరవళ్లు తొక్కుతోంది. బుధవారం నదిలో సుమారు 20 అడుగుల లోతు నీళ్లు ప్రవహిస్తున్నాయి. పైతట్టు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో నదిలోకి నీళ్లు భారీగా వచ్చి చేరుతున్నాయి. కుందూ నదిలో పుష్కలంగా నీరు ప్రవహిస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో నదీ పరివాహక గ్రామాలలో వరి నాట్లు నాటుతున్నారు. అన్నవరం, నాగులపల్లె, ఖాదర్‌పల్లె, చాపాడు, సీతారామపురం, పెద్దగురవలూరు, తదితర గ్రామాల వద్ద కుందూ నది తీరం వెంబడి రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు.

విద్యా సంబంధిత అంశాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యా సంబంధిత అంశాలపై సంపూర్ణ అవాహన పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ భవనంలో జిల్లా స్థాయిలో హ్యూమన్ క్యాపిటల్ వికసిత్ భారత్‌లో భాగంగా స్కూలింగ్, బిల్డింగ్‌పై ఒక్కరోజు వర్క్‌షాప్‌ను సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ నిత్యానందరాజులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జిల్లా స్థాయి వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్క్‌షాప్‌లో చర్చించిన విషయాలను రాష్ట్రస్థాయికి పంపడం జరుగుతుందన్నారు. సమగ్ర శిక్ష ఏపీసీ నిత్యానందరాజులు మాట్లాడుతూ ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు విలువైన సలహాలు ఇస్తే రాష్ట్రస్థాయ అధికారులకు పంపడం జరుగుతుందన్నారు. ఎంఈఓలను, ప్రధానోపాధ్యాయులను ఐదు గ్రూప్‌లుగా విభజించి చర్చించి వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారన్నారు. డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి వర్క్‌షాప్ ప్రాధాన్యతను వివరిస్తూ విద్యాశాఖలో చాలా మార్పులు వచ్చాయన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సరస్వతి, జిల్లా వైద్యశాఖ నుంచి వైద్యాధికారి వెంకట చంద్రారెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతి



ఉమీర్ మృతదేహం

వీరపునాయునిపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోత): మండలంలోని సర్వరాయసాగర్ రిజర్వాయర్ సమీపంలో ఉన్న బావిలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా చిందనూరు తాలూకా ఆర్ఎస్‌పోరు గ్రామానికి చెందిన ఉమీర్ (22) సిక్స్‌లైన్ రోడ్డుకు సంబంధించి రాడ్ బెండ్ హెల్పర్‌గా పనిచేస్తూ ఉండేవాడు. బుధవారం వర్షం వస్తుండడంతో పని నిలిపి వేశారు. దీంతో ఉమీర్ సమీపంలోని బావి వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో అతనికి ఫిట్స్ రావడంతో బావిలో పడి మృతి చెందాడు. విష యాన్ని తోటి కార్మికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వేంపల్లె అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరుకు తీసుకెళ్లారు.

గుర్తుతెలియని వాహనం ఢీ... వ్యక్తి మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన నజీర్ మృతదేహం

ప్రొద్దుటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు జమ్మలమడుగు హైవేలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో షేక్ నజీర్ అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందగా... మౌలా అనే మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... షేక్ నజీర్ ప్రొద్దుటూరు మండలం అమృతనగర్‌కు చెందిన లారీ మెకానిక్. కొలిమిగుండ్ల దగ్గర లారీ చెడిపోవడంతో మరమ్మత్తులు చేయడానికి మంగళవారం బైకుపై మౌలా అనే వ్యక్తితో కలిసి వెళ్లాడు. లారీ రిపేరు అనంతరం ప్రొద్దుటూరుకు బయలు దేరి వస్తుండగా అర్ధరాత్రి ప్రొద్దుటూరుకు సమీపంలోని బళ్లారి క్రిష్ణపట్నం హైవేపై వెనకాల గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో నజీర్ పైకి టైర్లు ఎక్కి శరీరం నుజ్జు నుజ్జు అయింది. వెనక ఉన్న మౌలా గాయాలతో బయటపడ్డాడు. వీరిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ అరుణ్ రెడ్డి తెలిపారు.

నడిరోడ్డుపై దిగబడిన లారీ

- వాహనదారులు, రైతులకు ఇబ్బందులు



చిన్నమండెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ రాళ్లు తరలిస్తున్న రోడ్డుపై దిగబడి పోవడంతో రైతులు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. క్వారీ నుంచి గ్రానైట్ రాళ్లు తీసుకెళుతున్న లారీ మంగళ వారం రాత్రి దేవగుడిపల్లె, రౌతుకుంట రహదారి లో దిగబడి పోయింది. ఎక్స్‌కవేటర్ సాయంతో రాత్రంతా శ్రమించినా ఫలితం లేకపోవడంతో, బుధవారం మరో ఎక్స్‌కవేటర్‌ను రప్పించి లారీని బయటికి తీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అటుగా వెళుతున్న వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధిక లోడుతో వెళ్లే లారీలు ఈ మార్గంలో ఎక్కు వగా వెళుతుండడంతో రోడ్డు ధ్వంసమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పొలాలకు వెళ్లే రహదారుల్లో భారీ లోడు వాహనాలు వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని విన్నవించుకుంటున్నారు.

ఇళ్లలో చోరీకి పాల్పడే దొంగ అరెస్టు

- బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ప్రొద్దుటూరు రూరల్ సీఐ



దొంగ నుంచి రికవరీ చేసిన బంగారు ఆభరణాలు



దొంగను చూపిస్తున్న సీఐ మద్దిలేటి, ఎస్ఐ వెంకటరమణ

రాజుపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాజుపాళెం మండలం టంగుటూరులో ఇటీవల పట్టపటలు చోరీకి యత్నించి.. అడ్డుకున్న ఇంటి యజమానిపై దాడి చేసిన నిందితుడు మహ్మద్‌రఫిని బుధవారం మధ్యాహ్నం పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాల మద్దిలేటి, రాజుపాలెం ఎస్ఐ వెంకటరమణతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దువ్వూరు మండలం జిల్లెల గ్రామానికి చెందిన మహ్మద్‌రఫి గతంలో జిల్లాలోని పలుచోరీ కేసుల్లో నిందితుడని.. కర్నూలు, వెలుగోడు, కొలింగుండ్ల, ఓర్వకల్లు, చాగలమర్రి, ఆళ్లగడ్డ తదితర పోలీసు స్టేషన్లలో ఇతనిపై కేసులు నమోదయ్యాయన్నారు. పట్టపగలు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడేవాడన్నారు. ఈనెల 7న టంగుటూరు గ్రామంలో నంద్యాల వెంకటసబ్బయ్య ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించి చోరీకి యత్నించాడు. అదే సమయంలో వెంకటసుబ్బయ్య ఇంటిలోకి రావడంతో నిందితుడు ఇనుపరాడ్డుతో దాడికి పాల్పడ్డారన్నారు. దాడిలో తీవ్రంగా గాయప డిన ఇంటి యజమాని కేకలు వేయడంతో రఫి పారిపోయారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామ న్నారు. బుధవారం గోపాయపల్లె చెక్‌పోస్టు వద్ద ఉండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. చోరీ చేసిన బంగారు ఆభరణాలను నిందితుడి వద్ద నుంచి రికవరీ చేసినట్లు తెలిపారు. మహ్మద్‌రఫిపై దొంగతనం కేసులు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు సీఐ వివరించారు.

'అప్రజాస్వామికంగా ఉప ఎన్నికలు'

కమలాపురం రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికలను కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా నిర్వహించిందని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ నరేన్‌రామాంజులరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందుల మండలాల్లో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికలను నీచమైన రాజకీయాలతో నిర్వహించిందని ఆయన తెలిపారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

సింహాద్రిపురం, ఆగస్టు 13(ఆంధ్రప్రభ): ఒంగోలులో ఈనెల 20 నుండి 25వ తేదీ వరకు నిర్వహించే సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం ఆయన సింహాద్రిపురంలో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఈశ్వరయ్య, మండల కార్యదర్శి అమీర్‌బాషా, ఆకుల అంకన్న, సురేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కమలాపురం రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో కేజియా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు అధికంగా కురుస్తున్నందున గ్రామీణ ప్రాంతాల్లోని వీధుల్లో నీరు నిల్వ లేకుండా కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా మురికి నీరు, బురద ఉంటే వెంటనే వాటిని తొలగించి బ్లీచింగ్ పౌడరు చల్లాలన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతే ప్రధాన లక్ష్యమన్నారు.

వర్షపునీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలి

వల్లూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వర్షాలు పెరిగిన నేపథ్యంలో మండల పరిధిలోని గ్రామాల్లో మురికినీరు నిలవడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీధర్ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని వీధుల్లో బురద, చెత్త, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని, బ్లీచింగ్ పౌడరు చల్లడం వంటి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న ఆలంఖాన్‌పల్లె టీడీపీ నాయకులు

కడప మారుతీనగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. నగరంలోని 49వ డివిజన్ ఆలలంఖాన్‌పల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఆ మేరకు బుధవారం సంఘం కార్యాలయం వద్ద ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. రైతు సంక్షేమం కోసం వ్యవసాయ సహకార పరపతి పాటుపడుతున్నాయన్నారు. ఆ సంఘాలు రైతులకు రుణాలు, విత్తనాలు, ఎరువులు, సబ్సిడీ ధరలకే అందిస్తాయన్నారు. ఆలంఖాన్‌పల్లె పరపతి సంఘం దాదాపు రూ.3కోట్ల బకాయిలతో ఉందన్నారు. ప్రస్తుత చైర్మన్ సారథ్యంలో రైతుల పురోగతికి బాటలు వేసేలా తగు రీతిగా స్పందిస్తారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విత్తనాలు, ఎరువులు తదితర సౌకర్యాలు అందిపుచ్చుకుని వ్యవసాయంలో మంచి పంటలు పండించి లాభసాటిగా మెలగాలని ఆకాంక్షించారు. ముందుగా అలంఖాన్‌పల్లెకు చేరుకున్న ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిని సంఘం కార్యాలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాలెంపల్లె సుబ్బారెడ్డి, గోపాల్‌రెడ్డి, పి.రాజా, బాబాఫకృద్దీన్, జానకిరాం, నిత్య, గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ ఉప ఎన్నికలలో ప్రజాస్వామ్యం ఖూనీ

● వైసీపీ నేతలు రవీంద్రనాథ్‌రెడ్డి, అంజాద్‌బాషా



విలేకరులతో మాట్లాడుతున్న వైసీపీ నేతలు

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 13(ఆంధ్రజ్యోత): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా మండిపడ్డారు. బుధవారం కడప నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. దేశ చరిత్రలో ఇలాంటి ఎన్నికలు ఎప్పుడూ చూడలేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలుచేశారని, పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ నాయకులు రిగ్గింగ్‌కు పాల్పడినట్లు ఆరోపించారు. స్థానికులను సైతం వారి గ్రామాల్లో తిరగనివ్వని పరిస్థితి ఏర్పడిందన్నారు. దాడి చేసి తిరిగి వైసీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించారని, డీఐజీ కోయ ప్రవీణ్ జడ్పీటీసీ స్థానానికి పోటీ చేసినట్లు వ్యవహరించారని అన్నారు. పలు ప్రాంతాల్లో స్థానిక మహిళలు పోలీసులపై తిరగబడిన సందర్భాలున్నాయన్నారు. సమావేశంలో పాకా సురేష్, పులి సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల గ్రాట్యుటీ, వయోపరిమితి పెంపుపై హర్షం

కడప మారుతీనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల పోరాట ఫలితంగా కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్లకు గ్రాట్యుటీ, వయోపరిమితి పెంపు, 180 రోజుల వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవుల ఉత్తర్వులను జారీ చేయడం హర్షణీయమని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి, జిల్లా గౌరవ అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆశా వర్కర్లకు 1.50 లక్షల గ్రాట్యుటీ, ఆరు నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, ఉద్యోగవిరమణ వయసు 62 ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, శాంతమ్మ, అమ్ములు, అనసూయ, వరలక్ష్మి, అనిత, రేణుక పాల్గొన్నారు.

ఎంహెచ్‌పీఎస్ పులివెందుల అధ్యక్షుడిగా మహబూబ్ బాషా

వేంపల్లె, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి పులివెందుల నియోజకవర్గం కమిటీ అధ్యక్షుడిగా వేంపల్లెకు చెందిన మహబూబ్ బాషాను నియమించారు. బుధవారం విజయవాడలోని ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో వేంపల్లెకు చెందిన పది మందిని పులివెందుల కమిటీ సభ్యులుగా నియమించారు. ఈ నేపథ్యంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారుక్ షిబ్లీ ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందించారు. వైస్ ప్రెసిడెంట్‌గా కరిముల్లా, సెక్రటరీగా దర్బార్‌వలి, జాయింట్ సెక్రటరీగా పాలగిరి గౌస్‌పీర్, సభ్యులుగా కరిముల్లా, మొహమ్మద్ గౌస్, అమీరుద్దీన్, బాబా ఫకృద్దీన్‌లను నియమించినట్లు తెలిపారు.

ఫిజియోథెరపీ పరికరాలతో మెరుగైన సేవలు

వేంపల్లె, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీ పరికరాలతో పీహెచ్‌సీల్లో వృద్ధులకు మెరుగైన సేవలు అందుతాయని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాజామొహిద్దీన్ అన్నారు. బుధవారం జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా సీహెచ్‌సీ సిబ్బంది, నర్సులకు స్ట్రెస్ మేనేజ్‌మెంట్, ఫిజియోథెరపీపై ప్రత్యేక శిక్షణాశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం పీహెచ్‌సీ, సీహెచ్‌సీ కేంద్రాల్లో జెరియాట్రిక్ క్లినిక్‌లను ప్రారంభించిందని, ఈ క్లినిక్‌లలో వృద్ధులకు అత్యాధునిక ఫిజియోథెరపీ సేవలు అందించేందుకు స్టేషనరీ సైకిల్, ఐఆర్‌ఆర్ ల్యాంప్, వాకర్స్, గైట్ ట్రైనర్ వంటి ఆధునిక పరికరాలు సమకూర్చారని తెలిపారు. డాక్టర్ విష్ణు (ఎపిడెమాలజిస్ట్, ఎస్సీడీ) మాట్లాడుతూ వృద్ధుల ఆరోగ్య పరిరక్షణలో నర్సుల పాత్ర కీలకమన్నారు. ఈ పరికరాల వినియోగం, రోగులకు ఉపయోగాలను డాక్టర్ దీప (ఎంపీటీ), స్ట్రెస్ మెనేజ్‌మెంట్‌పై డాక్టర్ కవిత (సైకియాట్రిస్ట్) నర్సులకు వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

కడప మారుతీనగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్‌ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండోరోజు బుధవారం కడప ఆర్టీసీ బస్టాండు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కడపడిపో అధ్యక్షుడు జయరాం, గ్యారేజీ సెక్రటరీ మల్లేష్ మాట్లాడుతూ ఉద్యోగుల వేతన సవరణ పూర్తికాబడి రెండు సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో తక్షణమే ఐఆర్ ప్రకటించాలన్నారు. విశాఖ స్టీలు ప్లాంటు డిపోను తరలింపును మానుకోవాలని, పెండింగులో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగముని, సుబ్బరాయుడు, లక్ష్మయ్య, రాఘవ పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతులను పాటించాలి

కమలాపురం రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించి అధిక దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయాధికారి సరస్వతి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చదిపిరాళ్ల, రామచంద్రాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి ఆరోగ్యవంతమైన మంచిదిగుబడినిచ్చే పంటలను పండించాలని తెలిపారు. ఇంకా పంటల్లో వచ్చే వివిధ రకాల పురుగుల నివారణకు మందులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ సహాయకుడు సునీల్, రైతులు పాల్గొన్నారు.

పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం దారుణం : సతీష్‌రెడ్డి

వేంపల్లె, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం దారుణమని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉప ఎన్నిక సందర్భంగా దాడులు చేసిన వారిపై కేసులు పెట్టకుండా తమ పార్టీకి చెందిన వారిపైనే పోలీసులు కేసులు పెట్టారన్నారు. ఈ విషయంపై డీఐజీ మాట్లాడిన మాటలకు నాగరిక ప్రపంచం తలదించుకునేలా ఉందన్నారు. పోలీసులంటే భయం ఉంటే ఈ సంఘటనలు జరిగేవి కాదన్నారు. పోలీసులు వారికి కావాల్సిన వ్యక్తులను గెలిపించాలని అనుకుంటే ప్రజాస్వామ్యం ఎందుకన్నారు. ఎలక్షన్ కమిషన్ కళ్లు తెరవాలని, రెండు పోలింగ్ బూత్‌లోనే రీపోలింగ్ పెడతారా అని ప్రశ్నించారు. ఫలితాలు వెలువరిస్తే ఎన్నికల కమిషన్‌కు సిగ్గుపోతుందన్నారు.

'దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది'

వేంపల్లె, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాహుల్‌గాంధీకి ఎవరితోను హాట్‌లైన్‌లో ఉండాల్సిన అవసరం లేదన్నారు. ఓట్ల చోరీపై రాహుల్‌గాంధీ దేశంలో ఒక యుద్ధమే చేస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో కూడా ఓట్ల చోరీ జరగిందని మీరు నమ్మితే ఎంపీ, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు, నాయకులతో ఢిల్లీలో పోరాటం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీద జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడిన తీరు బాగలేదన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం

చక్రాయపేట, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పం గ్రామ పంచాయతీ బురుజుపల్లె ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ పదవీవిరమణ, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయప్రసాద్ మాట్లాడుతూ వీరిసేవలు ఆదర్శనీయమని విద్యార్థుల, పాఠశాల అభివృద్ధికి కృషిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘంరాష్ట్ర నాయకుడు ఎరుకలరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా పవన్‌కుమార్



కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా పవన్‌కుమార్ ఎంపికయ్యారు. ఈనెల 10, 11వ తేదీలలో భీమవరంలో జరిగిన ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలలో కడప నగరానికి చెందిన పవన్‌కుమార్‌ను జిల్లా కన్వీనర్‌గా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి ఈ బాధ్యత ఇచ్చిన రాష్ట్ర శాఖకి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న పులివెందుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

పులివెందుల రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాల బారిన పడకుండా భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్-మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా చైతన్యం కల్పించాలని, మానసికంగా, శారీరకంగా, సామాజికంగా ఆరోగ్యంగా ఉండి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తమ వంతు పాత్ర వహించాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం మాదకద్రవ్యాల వినియోగం చేయకుండా, జీవితాలను తప్పుదోవలో ప్రయాణించకుండా తమ వంతు కృషి చేస్తామని విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ సి.బాలనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ కోఆర్డినేటర్లు డాక్టర్ శ్రీనిత, ఎన్.శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ కె.విజయలక్ష్మి, డాక్టర్ రాధిక, గౌతమి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మత్తు పదార్థాలపై విద్యార్థులకు వివరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి

సీకేదిన్నె, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కడప లీగల్ టీం సభ్యుడు ఆయూబ్‌ఖాన్ తెలిపారు. స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటుపడితే మానసిక వికాసం, శారీరక ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని, ఆలోచన పద్ధతులు మారడంతో పాటు మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ క్రిష్ణకిశోర్, కడప రిహాబిలిటేషన్ ఆఫీసర్ మాట్లాడుతూ డ్రగ్స్ వలన దుష్పరిణామాలు కలుగుతాయని, డ్రగ్స్ మోతాదు మించితే మూర్ఛ కూడా రావచ్చునన్నారు. క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అంతర్గత క్రమశిక్షణను పెంచుకుని మారకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ విద్యాభివృద్ధిలో కేంద్రీయ విద్యాలయాలు కీలకం



గెలుపొందిన సర్టిఫికేట్లతో విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారతదేశ విద్యాభివృద్ధిలో కేంద్రీయ విద్యాలయాల పాత్ర ఎంతో కీలకమని ఎస్కే యూనివర్సిటీ రిటైర్డ్ ఇంగ్లీష్ ప్రొఫెసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి కొనియాడారు. కడపలోని పీఎం కేంద్రీయ విద్యాలయంలో బుధవారం కళోత్సవ్, ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్ (ఈబీఎస్‌బీ) పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పాఠశాల ప్రిన్సిపాల్ మునేష్ మీనా తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఫైన్‌ఆర్ట్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీలు వివిధ విభాగాల్లో జరిగాయి. కడప క్లస్టర్‌లోని పలు కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు సర్టిఫికేట్లు అందించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సీకేదిన్నె, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ తెలిపారు. స్థానిక కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఇండెక్షన్ ప్రోగ్రాం 2కే25కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుని వాటిని ఉపయోగించుకుని ఎటువంటి అన్యాయాలకు గురికాకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. నీతి నియమాలు, మానసిక దృఢత్వం, సామాజిక స్పృహ పెంచుకుని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. ఎటువంటి న్యాయ సమస్య కావాలన్నా టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఉచితంగా న్యాయసలహాలు పొందాలన్నారు. బాలల రక్షణ అధికారి సుభాష్‌యాదవ్, అదనపు డీఎంహెచ్‌వో రవిబాబు విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కళాశాల ఎండీ చంద్రఓబుళరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్నిరకాల వసతులు ఇక్కడ ఏర్పాటు చేసి వారి ఉన్నత స్థితికి తోడ్పడుతున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ టీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహిళా రక్షణ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ రాధా, అడిషనల్ కోఆర్డినేటర్ వీరశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అతిథులను సన్మానిస్తున్న కేఎస్‌ఆర్ కళాశాల ఎండీ చంద్ర ఓబుళరెడ్డి (నాని), తదితరులు

ప్రతి ఇంట్లో మువ్వన్నెల జండా ఎగరాలి



ర్యాలీగా వస్తున్న కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిలో మువ్వన్నెల జెండా ఎగరాలని కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని కోటిరెడ్డి మహిళా కళాశాల విద్యార్థినులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దేశ స్వాతంత్ర్య ఉద్యమ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. హర్ ఘర్ తిరంగా అంటే ప్రతి ఇంటిలో జాతీయ జండా అని అర్థం అని, ఇది ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ఇండియన్ రెడ్‌క్రాస్ క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్ కోఆర్డినేటర్ డాక్టర్ శచీదేవి, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగాను జయప్రదం చేయాలి

వేంపల్లె, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా బుధవారం జాతీయ జండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం మతం వర్గం అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు తమ ఇళ్లపై జాతీయ జండాను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ మాజీ సభ్యులు లక్ష్మిరెడ్డి, రామచంద్రారెడ్డి, బీజేపీ వేంపల్లె, వీరపునాయునిపల్లె మండలాల అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, తులసినాయుడు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సునీల్, రవియాదవ్, జగదీష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

16న శ్రీకృష్ణాలయం వార్షికోత్సవం



కృష్ణాష్టమి ఏర్పాట్లను పరిశీలిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని రైల్వేగేటు సమీపంలో వెలసిన శ్రీకృష్ణాలయం 9వ వార్షికోత్సవాన్ని ఈనెల 16న కృష్ణాష్టమి సందర్భంగా ఘనంగా నిర్వహించనున్నట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

'స్మగ్లర్‌కు సపోర్టు చేయడం దారుణం'

చెన్నూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో సాక్షి విలేకరి అని చెప్పుకుంటూ ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన వ్యక్తికి కొంతమంది రైతులు సపోర్టు చేయడం దారుణమని టీడీపీ మండల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ సీనియర్ నాయకుడు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సందు సురేశ్‌బాబు (ఆటోబాబు) విలేకరులతో మాట్లాడుతూ కొంతకాలంగా సోషల్ మీడియాను సృష్టించుకుని దాంట్లో డబ్బులు రాబట్టుకునేందుకు పలురకాల తప్పుడు పోస్టులు పెడుతూ ఎంతో మందిని ఇబ్బంది పెట్టాడన్నారు. ఎవరైనా అడిగితే బెదిరించేవాడని, పైగా పోలీసులు తనకు బాగా తెలుసునని, పనులు చేయిస్తానంటూ డబ్బులు కూడా తీసుకుని ఇబ్బందులు పెట్టాడన్నారు. ఈ వ్యక్తి చేసిన తప్పిదాలు ఒక్కొక్కటిగా బయటికి తీస్తామన్నారు. పైగా తాను వైసీపీ మాజీ ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరుడినని చెప్పుకుంటూ తిరిగాడని, ఇప్పుడు ఆ అనుచరుడే ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడ్డాడన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత కల్లూరు ఓబుల్‌రెడ్డి, గుమ్మళ్ల శివారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, పాలగిరి రమణారెడ్డి, కనుపర్తి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తడి పొడిచెత్తపై అవగాహన

ప్రొద్దుటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో తాత్కాలిక నియామకం కింద గత 2013 నుంచి పని చేస్తున్న నగర దీపికలకు ఇంటింటి వెళ్లి తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించేలా వార్డుల్లో ఉదయమే చెత్త వాహనాలతో పాటు వెళ్లి పనిచేయాలని కమిషనర్ రవి చంద్రారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తడి పొడి చెత్తను మున్సిపల్ వాహనాలకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నియామక పత్రాలు అందజేత

రాజుపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాజుపాలెంలోని పి.టంగుటూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ సభ్యులకు బుధవారం నియామక పత్రాలు అందించారు. సొసైటీ ఛైర్మన్‌గా ఖాదర్‌బాషా, డైరెక్టర్లుగా బీరంరెడ్డి వెంకట కొండారెడ్డి, గోపు వెంకటేశ్వర్లకు నియామకపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అనుసంధానంగా ఉండి సొసైటీని అన్నివిధాలుగా బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక అధికారి కొట్టాల జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, శంకర్‌రెడ్డి, గురువయ్య పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయండి

బద్వేలు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చలో ఢిల్లీ కార్యక్రమం ఈ నెల 18, 19వ తేదిలలో నిర్వహించనున్నామని, విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బద్వేలు గురుమూర్తి అన్నారు. ఈ మేరకు బుధవారం ఇందుకు సంబంధించి వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా నెరవేరని బీసీల న్యాయమైన డిమాండ్ల సాధనకు ప్రతి ఒక్క బీసీ నాయకుడు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి బీసీలందరూ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ సుబ్బరాయుడు, వర్కింగ్ అధ్యక్షుడు యు.వి.రమణయ్య యాదవ్, ఆవాజ్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అన్వర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి

బి.కోడూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయించుకోవాలని ఏడీఏ మురళీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని బి.కోడూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి, మినుము పంటల్లో సాగు, మెళకువలు ఎరువుల యాజమాన్యం సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు .అలాగే ప్రభుత్వం అందించే వివిధ పథకాలపై రైతులకు వివరిస్తూ సబ్సిడీ గురించి వారికి అవగాహన కల్పించారు. అలాగే రైతులు వరి సాగులో కాలిబాటలు ఏర్పాటు చేసుకుని వరి నారును కొనలు తుంచి నాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి కౌశిక, విస్తరణాధికారి షణ్ముకశ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

వర్షాలతో ఆరుతడి రైతుల బెంబేలు

- దెబ్బతిన్న మినుము, ఉల్లి పంటలు

దువ్వూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మినుము, ఉల్లిపంటలు సాగు చేసిన రైతులు డీలా పడుతున్నారు. వర్షాలు పడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. దిగుబడులు అందవేమోననే అభిప్రాయం వీరిలో వ్యక్తమవుతోంది. సాగు ఖర్చులు తక్కువ అయిన నేపథ్యంలో మండల వ్యాప్తంగా ఎక్కువ మంది రైతులు మినుము పంట వేశారు. ఈ పంట చేతికందాలంటే రైతులు మందులను ఎక్కువగా పిచికారి చేస్తారు. ఎకరాల సాగుకు రూ.30 వేలు దాకా పెట్టుబడుల కింద ఖర్చు చేశారు. ఈ పంట పండాలంటే పొలంలో నీరు నిలువకూడదు. తేమ అధికంగా ఉంటే పంట ఎదుగుదల లేకపోవడం, కాయల్లో ఉన్న గింజ పాడువుతుందని రైతులు అంటున్నారు. పూత, పిందె, కాయలు రాలిపోవడం ఇప్పటికే జరిగిందని వాపోతున్నారు.



మురళీనగర్ సమీప మినుము పొలంలో నిలిచిన వర్షపునీరు, పాత దువ్వూరు వద్ద దెబ్బతింటున్న ఉల్లి

పెట్టుబడులు కాదుగా నష్టాలను మూటకట్టుకోవాల్సిందేనని దిగులు పడుతున్నారు.

ఉల్లి రైతుల డీలా

మండల వ్యాప్తంగా ఉల్లి పంట సాగు చేసిన రైతులు డీలా పడుతున్నారు. చాలా చోట్ల సాగైన పొలాల్లో ఉల్లి లేత దశలో ఉంది. దీని సాగు కొరకు ఖర్చులు అధికంగా పెట్టారు. ఈ నేపథ్యంలో గుడిపాడు, రామాపురం, చల్లబసాయిపల్లె, నీలాపురం, మదిరేపల్లె, దాసరిపల్లె, మూడిండ్లపల్లె, రాంసాయి నగర్ ప్రాంతాల రైతులు పెద్దబళ్లారి రకం ఉల్లి అధికంగా సాగు చేశారు. ప్రస్తుత వర్షాలతో వేరుకుళ్లు, పూత తెగుళ్ల లాంటివి ఆశిస్తాయని భయపడుతున్నారు. వీటి వలన పైరు కుచించుకుపోయి ఆ ప్రభావం దిగుబడులపై పడుతుందనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. సుమారు 600 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. ఇప్పటికే వేలాది రూపాయలు ఖర్చు చేశారు. వర్షాలు ఇలాగే కొనసాగితే పంట తుడుచుకుపెట్టుకుపోయే అవకాశం ఉందని బెంబేలెత్తుతున్నారు.

రెండోరోజు కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



బద్వేలులో ఎన్ఎంయూ ఆధ్వర్యంలో రెండోరోజు కొనసాగుతున్న ధర్నా

బద్వేలురూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలంటూ ఏపీపీటీడీ ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో రెండోరోజు బుధవారం స్థానిక డిపో గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో వర్కింగ్ ప్రెసిడెంటు జనార్ధనరావు, ప్రెసిడెంటు చంద్రారెడ్డిలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో కార్యదర్శి శివరామిరెడ్డి హాజరై వారికి మద్దతు ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ వేతన సవరణ అయిపోయి రెండు సంవత్సరాలు పూర్తయినందున వెంటనే ఐఆర్ ప్రకటించాలని కోరారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంటు మొదలైన చెల్లింపులు తక్షణమే చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చంద్రయ్య, గ్యారేజీ కార్యదర్శి నాగేంద్ర, జాయింట్ సెక్రటరీ శ్రీధర్, ఎంఎస్‌రాయుడు, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, భాస్కర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ధర్నా నిర్వహిస్తున్నామని ఎన్ఎంయూఏ నాయకులు తెలిపారు. బుధవారం ఆర్టీసీ ప్రాంగణంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్రొద్దుటూరు డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ పీఆర్‌జీ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భానుప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులకు తక్షణమే పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, గవర్నర్‌పేట-2 డిపోను లూలా ప్రైవేటు సంస్థకు ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో కమిటీ మెంబర్లు అయ్యవారప్ప, వై.బాబు, గ్యారేజీ సెక్రటరి అశోక్, శేఖర్, దస్తగిరి, రవి, ఎన్ఎంయూఏ నాయకులు పాల్గొన్నారు.

బద్వేలు నియోజకవర్గాన్ని కడపలోనే కొనసాగించాలి

బద్వేలు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా కూటమి ప్రభుత్వం వ్యవహరించడం సరికాదని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జకరయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. జిల్లాలో ఉన్న బద్వేలు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో చేర్చడమంటే ఇక్కడి ప్రజలను ఇబ్బందులు, అయోమయానికి గురిచేసినట్లేనన్నారు. నియోజకవర్గ అబివృద్ధిపై దృష్టి సారించాలని, నియోజకవర్గాన్ని ఇతర జిల్లాలోకి మార్చే ఆలోచన విరమించుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్స్ రాష్ట్ర అధికార ప్రతినిధి పిచ్చయ్య, దళిత సీనియర్ నాయకులు కేశవయ్య, మాల మహాసేన రాష్ట్ర కార్యదర్శి రవి, తదితరులు పాల్గొన్నారు.

బద్వేలును కడప జిల్లాలోనే కొనసాగించాలి

బద్వేలు నియోజకవర్గాన్ని కడప జిల్లాలోనే కొనసాగించాలని కోరుతూ బుధవారం బద్వేలు పట్టణ అబివృద్ధి సొసైటీ ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. నియోజకవర్గం కడపకు దగ్గరగా ఉంటుందని, అదే అన్నమయ్య జిల్లాలో చేరిస్తే నియోజకవర్గంలోని సుదూర ప్రాంతాలైన కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల, బి.కోడూరు ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గురుమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: బద్వేలు నియోజకవర్గాన్ని కడప జిల్లాలో కొనసాగించాలని నేషనల్ హ్యూమన్‌రైట్స్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రసాదరావు, టీడీపీ నాయకుడు సుబ్బారావు, వైసీపీ నాయకుడు నాగార్జునరెడ్డి, టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బండి ఓబులేసు, జనసేన నాయకుడు లక్షుమయ్య సీపీఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో ఫణిరావు, రాజీవ్‌బాషా, ఈశ్వరయ్య, చెన్నరాయుడు సీపీఐ నాయకులు రవి, రజాసాహెబ్‌పేట సర్పంచ్ జనార్ధనరెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చాపాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయానికి సంబందించిన నూతన కమిటీని ఏర్పాటు చేసేందుకు స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవాలని ఆ దేవస్థానం ఈవో శ్రీనివాసులు పేర్కొన్నారు. దేవాలయం ఆనుకుని ఉన్న గ్రామాల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కమిటీలో మొత్తం 9 మంది సభ్యులు ఉంటారన్నారు. వీరిలో అయిదు మంది మహిళలు, మిగిలిన వారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలు ఉంటారన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఛైర్మన్‌కు నియామకపత్రాలు అందజేత

చాపాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులోని అల్లాడుపల్లె రైతు సేవా సహకార సొసైటీకి ప్రభుత్వం కొత్తగా నియమించిన ఛైర్మన్ మార్తల నరసింహారెడ్డికి డైరెక్టర్లు మేకల సుదర్శన్‌కు, గోసుల వీరారెడ్డికి బుధవారం ప్రొద్దుటూరు డీసీసీ బ్యాంకు సబ్‌డివిజనల్ కోఆపరేటివ్ అధికారి బ్రహ్మానందరెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ ముగ్గురు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సహకార సొసైటీ సీఈవో జాన్, సూపరింటెండెంట్ రంగయ్య పాల్గొన్నారు.

గర్భిణీలకు అవగాహన ఉండాలి

బి.కోడూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్భవతులు ప్రతిఒక్కరూ ప్లానింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని ప్రతిరోజూ పగలు రెండు గంటల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యాధికారి వినీత్ కుమార్‌రాజు అన్నారు. బుధవారం ప్రధాన మంత్రి సురక్షత్ మాతృత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు వివిద వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అలాగే గర్భవతులతో మాట్లాడుతూ కూరగాయలు, పండ్లు విరివిగా తీసుకుని హిమోగ్లోబిన్ పెంచుకోవాలన్నారు. అనంతరం అక్కడికి వచ్చిన గర్భవతులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజరు జాన్‌విలియం, సునీత, విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సొసైటీ ఛైర్మన్‌గా గురివిరెడ్డి బాధ్యతలు

కాశినాయన, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా నియమించిన నర్సాపురం సొసైటీ ఛైర్మన్ మురుకూటి గురివిరెడ్డి (బంగారు గురివిరెడ్డి) బుధవారం బాధ్యతలు స్వీకరించారని సీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ మేరకు నర్సాపురం సొసైటీ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో లాంఛనంగా ఛైర్మన్‌గా గురివిరెడ్డి, పాలక మండలి సభ్యులుగా తోడేటి క్రిష్ణయ్య, మురుకూటి వేణుగోపాల్‌రెడ్డిలు రిజిష్టర్‌లో సంతకాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఓ.రోహిత్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అక్కి రమణారెడ్డి, ఉస్సేన్ పీరా, నర్సాపురం సర్పంచ్ చిన్నఖాజావలి పలువురు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేశ భక్తి భావం పెంపొందించడమే లక్ష్యం



మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ చేపట్టిన ఉద్యోగులు

ప్రొద్దుటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతి పౌరునిలో దేశ భక్తి భావం పెంపొందించడమే లక్ష్యంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టామని మున్సిపల్ కమిషనర్ చింతా రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పాణ్యం ఎర్రమునిరెడ్డి సర్కిల్లోని అన్నాక్యాంటీన్ నుంచి శివాలయం సర్కిల్ వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ ని మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు చేపట్టారు. ఈ సందర్భంగా రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ రాబో యే 79 వస్వాతంత్ర వేడుకల సం దర్భంగా ప్రతి కుటుంబంలో దేశభక్తి భావన పెంపొందాలంటే ఇంటిపై మూడు రంగుల జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అనంతరం భారత్ మాతాకి జై అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్‌బాషా, పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలను మంజూరు చేయండి

ప్రొద్దుటూరుటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట ప్రభుత్వం నిరుద్యోగులకు వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలను ఎప్పుడు మంజూరు చేస్తారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ ప్రశ్నించారు. బుధవారం డిప్యూటీ తహసీల్దారు అజయ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం వస్తే కార్పొరేషన్లను ఖాళీగా ఉంచమని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ విశ్వనాథ్ పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన లారీ

- రాకపోకలకు అంతరాయం



మూడు రోడ్ల కూడలిలో రోడ్డుకు అడ్డంగా నిలబడ్డ లారీ

దువ్వూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని మూడు రోడ్ల కూడలిలో బుధవారం రోడ్డుకు అడ్డంగా లారీ నిలిచిపోయింది. మైదుకూరు నుంచి ఆళ్లగడ్డవైపు వెళ్లే బస్సులు, లారీలు, ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల వరకు ఇదే పరిస్థితి నెలకొంది. లారీని మలుపు తిప్పుకునే సమయంలో అది పాడై రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. అక్కడి నుంచే ప్రొద్దుటూరు వైపు వెళ్లే దారి ఉండడంతో కొంతమేరకు వాహనాల రాకపోకలకు వీలు కలిగింది. ట్రాఫిక్ సిబ్బందుల్లో ప్రయాణికులు వాహనాలు చాలాసేపు నిలిచిపోయి ఇబ్బంది పడ్డారు. ఈ పరిస్థితుల్లో పోలీసులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం కొసమెరుపు.

రైతులకు యూరియా అందించాలి

ఖాజీపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో యూరియా అందించాలని రావణపల్లె ఉపసర్పంచ్ లక్ష్మిరెడ్డి అన్నారు. బుధవారం వారు రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి అనంతరం వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని చెబుతున్నా అందుకు విరుద్ధంగా అధికారులు నడుచుకుంటున్నారని, ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకుని ఉన్నతాధికారులు రైతులకు యూరియా అందించాలని వారు అన్నారు. ఏవోను వివరణ కోరగా రైతు భరోసా కేంద్రంలో ఉద్యాన శాఖ సిబ్బంది వచ్చి విధులకు హాజరైనట్లు, ఎటువంటి పత్రాలు ఇవ్వలేదని, అలాంటి వారికి లాగిన్ అప్పజెప్పడం వలన అక్రమాలకు పాల్పడితే బాధ్యులు ఎవరని ప్రశ్నించారు.

రూ.48 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న కొండారెడ్డి

ప్రొద్దుటూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో సిఎం సహాయనిధిని అడ్డంగా వైసీపీ ఎమ్మెల్యేలే దొంగబిల్లులు పెట్టుకొని దోచుకుతిన్నారని టీడీపీ ప్రభుత్వంలో బాధితులకు సిఎం సహాయనిధి పారదర్శకంగా అందుతుందని టీడీపీ రాష్ట కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్దానిక టీడీపీ కార్యాలయంలో 70 మందికి రూ.48,61,986 సిఎం సహాయనిధి చెక్కులను కొండారెడ్డి చేతులమీదుగా బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ గత ఏడాది కాలంలోనే సిఎం సహాయనిధి కింద ప్రొద్దుటూరు నియోజకవర్గంలో దాదాపు రూ.5 కోట్లమేర బాధితులకు పారదర్శకంగా అందజేశామన్నారు. ఇందులో ఎవ్వరికి కమీషన్లు ఇవ్వాల్సిన పనిలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్లు తాటి శీను, తలారి పుల్లయ్య, టీఎన్‌టియూసి జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడి అవలంబించాలి



రైతులతో మాట్లాడుతున్న ఏవో

కొండాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని మండల వ్యవసాయాధికారి ఏవీ రావాంజులరెడ్డి తెలిపారు. మండలంలోని పి.అనంతపురం, ఏటూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రతి రైతు భూసార పరీక్షలు, ఈ క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో తెలిపారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ జమకాని రైతు రైతుసేవా కేంద్రాల ద్వారా అర్జీలు పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో రమేష్, రైతులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దారు

మైలవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం ధాటికి బుధవారం మండల కేంద్రంలో రెండు ఇళ్లు కూలాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ కూలిన ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ప్రొద్దుటూరుటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈ నెల 16న వైభవంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ నిర్వాహకులు మధురేసుదాసు, నిరంజన్ గోవిందదాసు పేర్కొన్నారు. బుధవారం ఇస్కాన్ కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16వ తేదీ శనివారం ఉదయం శ్రీకృష్ణ బలరామ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలలతో అలంకరిస్తామన్నారు. సాయంత్రం 4.30 గంటలకు అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో శ్రీకృష్ణ, బలరాముల దర్శనం, హరినామ సంకీర్తన తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అలాగే 40 వేల మంది భక్తులకు అన్నప్రసాద వినియోగం ఉంటుందన్నారు.

అవయవదానంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కొవ్వూరు రమేష్‌రెడ్డి

ప్రొద్దుటూరుటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అవయవ దానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కొవ్వూరు గ్రాండ్ ఛైర్మన్, అవయవ గ్రహీత కొవ్వూరు రమేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా కొవ్వూరు గ్రాండ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవయవదానం చేసి మరణానంతరం కూడా జీవించాలని పేర్కొన్నారు. ఒకరి అవయవ దానం కొందరి జీవితాల్లో వెలుగు నింపుతుందని, తనకు లివర్, కిడ్నీ మార్పిడి జరిగి 23 ఏళ్ల అయినా ఆరోగ్యంగా జీవిస్తున్నానన్నారు. అవయవమార్పిడి కోసం ప్రభుత్వం ఆర్థికసాయం చేస్తోందని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్ట్రెస్ అండ్ మేనేజ్‌మెంటుపై శిక్షణ



మాట్లాడుతున్న అధికారులు

పోరుమామిళ్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసరు డాక్టర్ రమేశ్ పర్యవేక్షణలో స్ట్రెస్ అండ్ మేనేజ్‌మెంటు అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం పోరుమామిళ్లలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బందిలో సామర్థ్యం పెంపొందించుకునేందుకు చేపట్టిన కార్యచరణలో భాగంగా నిర్వహించారు. ఉద్యోగస్తులు, ఉద్యోగ సంబంధిత వత్తిడికి గుర్తించడం, సమర్థవంతంగా నిర్వహించడానికి వ్యూహాలు, అవగాహన చేసుకోవడంపై దృష్టి సారించారు. కార్యక్రమంలో వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్టాఫ్ నర్సులు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసరు వెంకటేశ్వర్లు, ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

సహకార సొసైటీ సంఘం ఎంపిక

ముద్దనూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల సహకార సంఘం ఎంపిక చేసినట్లు సహకార సొసైటీ సీఈవో రత్నం తెలిపారు. అధ్యక్షుడిగా సురేంద్రనాథ్‌రెడ్డి, డైరక్టర్లుగా ఉత్తమారెడ్డి, మురళికి బుధవారం ఆయన నియామకపత్రాలను అందజేశారు. జిల్లా సహకార సంఘం అధికారి నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు మధుసూదన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.